రైతులకు విత్తన పంపిణీ చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

కొట్టుకున్న వైసిపి నేతలు

- కోనాపురంలో అధికార నేతల బాహాబాహి
- చెప్పులతో దాడులు చేసుకున్న నాయకులు
- రూ.1.21 కోట్ల పనుల్లో రూ.30 లక్షలు మింగేశారు..
- మొక్కలు పెట్టామంటూ నిధులు స్వాహా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, కనగానపల్లి

పేదల కోసం చేపట్టిన పనులను చేయకుండానే అధికారపార్టీ నేతలు మేసేశారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పేరుతో మొక్కలు పెట్టినట్టు రికార్డుల్లోకెక్కించి లక్షల రూపాయలు మింగేశారు. ఈ డబ్బుల వ్యవహారం సామాజిక తనిఖీలో వెల్లడయిన తరువాత తమకూ అందులో వాటా అందలేదని మరో గ్రూపు ఘర్షణకు దిగింది. రెండు రోజుల క్రితం పంచాయతీ జరిగినా సమస్యకు పరిష్కారం లభించలేదు. కార్యాలయం ఎదుటే పరస్పరం చెప్పులతో దాడులు చేసుకోవడంతో ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి కాస్త వెలుగులోకి వచ్చింది.

రూ.1.21 కోటి పనిచేసి రూ.30 లక్షలు మింగేశారు...

సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం పరిధిలోని కోనాపురం గ్రామం పరిధిలో 2021 ఏప్రిల్ ఒకటవ తేది నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు గ్రామ పంచాయతీ పరిధిలో 165 పనులు చేశారు. సుమారు రూ.1.21 కోట్ల విలువైన పనులు చేశారు. ఇందులో రూ.56.55 లక్షలు వేతనాలకింద కూలీలకు డబ్బులు చెల్లించారు. మరో రూ.65.42 లక్షలు మెటీరియల్ కాంపొనెంట్ కింద ఉపాధి హామీ పథకం నుంచి నిధులు వెచ్చించారు. జరిగిన ఈపనులన్నింటీనీ ఈ ఏడాది మార్చి నెలలో సామాజిక తనిఖీని చేపట్టారు. ఈ సామాజిక తనిఖీలో పరిశీలించినప్పుడు పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నట్టు స్పష్టమైంది. 19 పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా చేసినట్టు తేలింది. ఇందులో ప్రధానమైనది డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పేరుతో మొక్కలు పెట్టకుండానే డబ్బులు డ్రా చేసేశారు. వర్కు కోడ్ 9166008170869, 857,837,842,835,858 పనుల కింద జామ, మామిడి మొక్కలు 7604 నాటినట్టు చూపించి ఒకే దగ్గర రూ.19.17 లక్షలు డబ్బులు కాజేశారు. అదే పద్ధతిలో మరో చోట రూ.5.98 లక్షలు, ఇంకో చోట బ్లాక్ ప్లాంటేషన్ పేరుతో వెయ్యి మొక్కటు నాటినట్టు చూపించి రూ.4.08 లక్షలు ఇలా మొత్తం 19 పనుల్లో ఈ అక్రమ చోటు చేసుకున్నట్టు సామాజిక తనిఖీల్లో స్పష్టమైంది. అంతేకాకుండా సగం మంది వద్ద జాబ్‌కార్డులు కూడా వారిద్దలేవని, నేతల వద్దనే ఉన్నట్టు కూడా సామాజిక తనిఖీల్లో తేలింది. ఈ కార్డులను వారి వద్ద ఉంచుకుని బిల్లులను డ్రా చేసి తినేసినట్టు ఆరోపణలున్నాయి.

ఎంపిడిఒ కార్యాలయంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న కోనాపురం వైసిపి నాయకులు

వైసీపీ నాయకుడు ఆత్మహత్యా యత్నం

మండల పరిధిలోని కోనాపురం గ్రామ వైసీపీ నాయకుడు పైలట్ ముత్యాలు సోమవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి అనంతపురం నగరంలోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. ఉపాధి హామీ బిల్లుల అవినీతి బహిర్గత ఘటనలో స్థానిక ఎంపీటీసీ, వైసీపీ నాయకుడు పైలట్ ముత్యాలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట దాడులు చేసుకున్నారు. అయితే ఈ విషయంపై స్థానిక పోలీసులు తన ఇంటి వద్దకు వచ్చి విచారణ చేయడంతో పైలెట్ ముత్యాలు అవమానంగా భావించాడు. తమ పార్టీ అధికారంలో ఉండి కూడా తన ఇంటికి పోలీసులు రావడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. ఉపాధి పథకంలో దొంగ బిల్లులు పెట్టుకొని లక్షల రూపాయలు కాజేసిన వారిని వదిలి పోలీసులు ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంలో తనను విచారణ చేయడాన్ని అవమానంగా భావించిన ముత్యాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతని కుటుంబసభ్యులు తెలిపారు.

చెప్పులతో కొట్టుకున్న నేతలు

కనగానపల్లి : అధికార పార్టీ నేతలు బాహాబాహికి దిగారు. ఉపాధి డబ్బులు చెల్లింపు, పంపకాల విషయంలో వచ్చిన తేడాలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఏకంగా ఎంపిడిఒ కార్యాలయంలోనే నేతలు చెప్పులతో దాడులు చేసుకున్నారు. సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో చోటు చేసుకున్న ఈ ఘటన అధికార పార్టీలో నేతల మధ్య ఉన్న అసమ్మతి మరోసారి బట్టబయలు అయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కనగానపల్లి మండలం కోనాపరం పంచాయతీకి సంబంధించి ఉపాధి హామీ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సహకారంతో గ్రామ ఎంపీటీసీ వర్గం కలిసి ఉపాధి హామీ పనులు చేయకుండానే చేసినట్లు చూపి సుమారు రూ.పది లక్షలు బిల్లులు చేసుకున్నట్లు అదేగ్రామానికి చెందిన వైసిపి నేతలు వారిపై ఆరోపణలు చేస్తున్నారు. ఈ డబ్బుల పంపకాలకు సంబంధించి గ్రామంలో ఓ వైసిపి నాయకుడు, ఎంపిటిసి వర్గంకు మధ్య గత కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. రెండు రోజులు కిందట గ్రామంలో ఘర్షణ పడ్డారు. ఈ విషయం తెలిసి వైసీపీ మండల ప్రధాన నాయకుడు వారికి సర్దిచెప్పి గొడవ పెద్దది కాకుండా సద్దుమణిగేలా చేశాడు. అప్పటికి మౌనంగా ఉన్న నేతలు సోమవారం నాడు మళ్లీ గొడవపడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వద్ద వైసీపీ ప్రధాన నాయకుని సమక్షంలో చర్చిస్తున్న సందర్భంలో కోనాపురం ఎంపీటీసీ వర్గం, అదే గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రెండు వర్గాలుగా విడిపోయి భౌతికదాడులు చేసుకున్నారు. మండల వైసీపీ ప్రధాన నాయకుడు, పోలీసులు సమక్షంలోనే ఎంపీడీవో కార్యాలయంలో ఏకంగా చెప్పులతో దాడులు చేసుకున్నారు. వీరి దాడులతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగుజేసుకుని ఇరవర్గాల వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపివేశారు. అక్రమంగా ఉపాధి బిల్లులు కాజేయడం కోసం అధికార పార్టీ నేతలు ఇలా ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఏమిటంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. కాగ ఈ ఘటనపై ఆ పార్టీ ముఖ్యనేతలు ఎవరూ స్పందచలేదు.

రైతులందరికీ సబ్సిడీ విత్తనం

కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

జిల్లా వ్యాప్తంగా సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం ఆర్‌బికెల్లో దరకాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ విత్తన కాయలను పంపిణీ చేస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. పుట్టపర్తి వ్యవసాయ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్‌పర్సన్ రమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధికంగా పండించే వేరుశనగకు సబ్సిడీ ఇస్తూ నాణ్యత కలిగిన విత్తనాన్ని సరఫరా చేయాలనే ఉద్దేశంతో రైతు భరోసా కేంద్రం ద్వారా ఎక్కడా క్వాలిటీ, క్వాంటిటీలో రాజీ లేకుండా నాణ్యమైన విత్తనం అందిస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన వేరుశనగ విత్తనాన్ని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. ఎక్కడైనా విత్తనం సరిగా లేదని అనిపిస్తే వ్యవసాయ అధికారిని అడగాలని, నాణ్యత పరిశీలించుకుని మంచి విత్తనం తీసుకెళ్లాలన్నారు. విత్తనాలు మొలకెత్తుతాయా లేదా అనేది ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ ట్రేలలో సాగు చేస్తున్నామని, మనం నాటిన విత్తనాలను ఆర్‌బికెల్లో పరిశీలించవచ్చన్నారు. రాయితీ వేరుశనగ విత్తనం నాణ్యత చాలా బాగుందని, అపోహలను సృష్టిస్తే రైతులు ఎవరూ నమ్మవద్దన్నారు. జిల్లాలో లక్ష క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని పంపిణీ చేసేలా ఈ సీజన్‌ను మొదలు పెట్టామన్నారు. జిల్లాలో 90 శాతం మందికి పైగా రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ ఒక ఎకరానికి 30 కేజీల ఒక బ్యాగ్, రెండు ఎకరాలలోపు ఉన్న వాటికి 2 బ్యాగులు, మూడు ఎకరాలకు పైన ఎంతఉన్నా కూడా మూడు బ్యాగులు ఇవ్వనున్నట్లు చెప్పారు. సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను పంట వేయడానికి, వ్యవసాయానికి మాత్రమే వినియోగించాలని ఇతర అవసరాలకు వీటిని వాడకూడదన్నారు. రైతులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అందరికీ సరిపడా విత్తనాలు ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం మంచి నాణ్యమైన విత్తనాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందించిన రాయితీ వేరుశనగ విత్తనాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఆర్డీవో భాగ్యరేఖ, తహశీల్దార్ నవీన్ కుమార్, ఏడీఏ విద్యావతి, ఎంపిపి రమణా రెడ్డి, మార్క్ఫెడ్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపు

గ్రాట్యుటీ చెక్కును తీసుకుంటున్న ఓబులు, కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి నీటిసఫరాలో పని చేస్తూ మరణించిన ఆరుగురు కార్మికుల కుటుంబాలకు 1.71 లక్షల చెక్కులను సోమవారం నాడు అనంతపురం కార్మిక శాఖ కార్యాలయంలో డిసిఎల్ జి.రఘురాములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి సరఫరాలో పని చేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు గ్రాట్యుటీ 6 మందికి డిసిఎల్ పంపిణీ చేయడం కార్మికుల విజయం అన్నారు. కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో మూడు సమ్మెలు, 18 రోజుల కార్మికుల రిలే దీక్షలు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో జరిగిన సంప్రదింపుల మేరకు మొదటి దిశగా ఆరుగురికి కార్మికులకు సాయం అందిందన్నారు. ఇంకా 51 మంది కార్మిక కుటుంబాలకు గ్రాట్యుటీ అందాల్సి ఉందని వారికి కూడా వెంటనే ప్రభుత్వం చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి బోర్డ్ ఆఫీస్ ట్రైమ్మ ఆఫీసర్ రాజు, సత్యసాయి తాగునీటి సరఫరా యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రవిచారి, గోవిందు, రమేష్ రెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

ఖైదీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

సబ్ జైల్లోకి వచ్చే ఖైదీలపై అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సబ్‌జైల్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక సబ్ జైలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలులో ఉంటున్న ఖైదీలతో ఏయే కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటినుండి ఉన్నారు, న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పదేపదే తప్పులు చేసి జైల్లోకి రావడం వల్ల అటు కుటుంబాలు వీధిన పడటంతో పాటు ఇటు సమాజం నుండి అవమానాలు గురికావాల్సి ఉంటుందని చెప్పారు. ప్రవర్తన మార్చుకుని మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, ఆంజనేయులు, నవేరా తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలతో మాట్లాడుతున్న అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

సమస్యను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

యానిమేటర్లకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-పెనుకొండ

నగర పంచాయతీ పరిధిలో యానిమేటర్లుగా గత 20 సంవత్సరాలు నుంచి పనిచేసున్న వారిని అధికారులు తొలగిస్తున్నారని ఈ విషయంలో యానిమేటర్లకు న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం పెనుకొండ సబ్ కలెక్టర్ కె. కార్తీక్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు చెందిన డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, రికవరీ చేయించడం, ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ఇలా యానిమేటర్లు అనేక సేవలందిస్తున్నారని అన్నారు. అయితే వీరు కనీస వేతనం లేకున్నా గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారని తెలిపారు. యానిమేటర్ల కడుపు కొట్టకుండా వారిని అలాగే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి, సిఐటియు మండల కార్యదర్శి బాబవలి, తిప్పన్న, వసంతమాల, సునీత, సరస్వతి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ ఎం.సాయిరామ్

పకడ్బందీగా పది సప్లిమెంటరీ పరీక్షలు

2వ తేదీ నుంచి ప్రారంభం

డిఇఒ ఎం.సాయిరామ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

త్వరలో జరగబోయే పది సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని డిఇఒ ఎం.సాయిరామ్ తెలియజేశారు. సోమవారం ఉదయం నగరంలోని కెఎస్ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జూన్ రెండో తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 49 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. 14,465 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ప్రశ్నాపత్రాలు మంగళవారం జిల్లాకు వస్తాయని, వాటిని బుధవారం ఆయా పోలీస్ స్టేషన్లకు తరలిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ గోవింద నాయక్, డివైఈవోలు పద్మప్రియ, శంకర ప్రసాద్, పర్యవేక్షకులు సరళ, పాల్గొన్నారు.

జిల్లాలో మొదటి విడత

270 అక్రిడిటేషన్లు మంజూరు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 270 మంది జర్నలిస్టులకు 2023-24 కాల పరిమితికి సంబంధించి మొదట విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేశామని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అధ్యక్షతన మీడియా అక్రిడిటేషన్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కొరకు దరఖాస్తుల నియమ నిబంధనలు కచ్చితంగా పాటించిన అర్హులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేసామన్నారు. అక్రిటిటేషన్ మంజూరు కాని వారు రాష్ట్ర సమాచార శాఖ ఆన్ లైన్ వెబ్ సైట్ లో నిబంధనల మేరకు డాక్యుమెంట్లు అప్లోడ్ చేసి జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ఆ దరఖాస్తులను పరిశీలన అనంతరం రెండవ విడతలో అర్హత ఉన్నవారికి అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రెండవ విడత అర్హుల జాబితా తయారు చేయాలని జిల్లా సమాచార శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిపిఆర్ఒ వేలాయుధం, డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, జిల్లా కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రాజేష్, పుల్లయ్య, రామాంజులు, ఉదయ్ భాను, ఎపిఆర్ఒ ఫక్రుద్దీన్, పిఆర్ఒ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్సు అందజేత

కదిరి టౌన్ :2020వ సంవత్సరంలో సర్వీసులో వుండగా మృతిచెందిన ఆర్టీసీ డి.విశ్వనాథ్ కుటుంబానికి ఇన్సూరెన్సు అందజేశారు. ఈ మేరకు మృతుని భార్య ఉమాదేవికి ప్రావిడెంట్ ఫండ్ నుండి వచ్చిన లింకు ఇన్సురెన్సు మొత్తం ఐదు లక్షలరుపాయల చెక్కును కదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్ అందించారు. ఈ కార్యక్రమములో విశ్వనాథ్ కుటుంబ సభ్యులు రాధక్రిష్ణ, అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్, ట్రాఫిక్ సూపర్‌వైజరు నాగసుబ్బయ్య, ఆఫీసు సిబ్బంది శ్రీనివాసులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రామనాథ్ రావుకు శ్రీకృష్ణదేవరాయ అవార్డు

ప్రజాశక్తి - చిలమత్తూరు

అంతరించి పోతున్న పౌరాణిక,జానపద కళలను ప్రోత్సహిస్తూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తూన్న దేమకేతేపల్లి కి చెందిన రామనాథ్ రావుకు శ్రీకృష్ణదేవరాయ అవార్డు వరించింది. హంపీ పట్టణంలోని బలిజ భవన్లో సిటిజెన్ వెల్ఫేర్ ఫోరం ప్రైడ్ ఇండియా కల్చరల్ సంయుక్త సభ్యులు శ్రీకృష్ణ దేవరాయ అవార్డును రామనాథ్ రావుకు బహుకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దరికం సాయి, తేనే తెలుగు అంజనప్ప, బొగ్గు రవి ప్రసాద్, ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నష్టపోయిన పండ్లతోటల రైతులను ఆదుకోండి

బత్తలపల్లి : ఈదురు గాలులు,భారీ వర్షానికి పంట నష్టపోయిన పండ్లతోటల రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌ను జిల్లాకేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి. రమణ మాట్లాడుతూ అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల 32 మండలాలలోని మామిడి, అరటి, చీని, తదితర పండ్ల తోటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. అధికారులు గ్రామీణ ప్రాంతాలలోని అన్ని పంటలను పరిశీలించి వెంటనే నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం కాటమయ్య, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి గోవిందరెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు బండల వెంకటేష్, రైతులు వెంకటేశ్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ ,శ్రీరాములు, సుబ్బరాయుడు ,అనిల్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు

అనంతపురం క్రైం : అనంతపురం జిల్లా పోలీసు శాఖలో బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన బదిలీల కార్యక్రమంలో 71 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు/, ఎఎస్ఐలకు బదిలీలు చేసినట్లు చెప్పారు. 30-04-23వ తేదీ నాటికి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందిని సీనియార్టీ జాబితా ప్రకారం పారదర్శకంగా బదిలీలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జిల్లా పోలీసు పరిపాలనాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కదిరివాసికి శివనంది అవార్డు

కదిరి అర్బన్ : సిటిజన్ వెల్ఫేర్ ఫామ్ అండ్ ఫ్రైడ్ ఇండియా కల్చరల్ ఇంటర్నేషనల్ లెవెల్ డ్యాన్సింగ్ ఫెస్టివెల్ సందర్భంగా కదిరి వాసికి శివనంది అవార్డు వరించింది. కర్ణాటకలోని హోస్పేట్‌లో 27,28 వ తేదీలలో "శివ నంది" అవార్డుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలిండియా కల్చరల్ అసోసియేషన్ హంపి వారు కదిరి కి చెందిన ఆదిమూలం సూర్య నారాయణ గౌడ్‌కు శివనంది అవార్డు ప్రదానం చేశారు. ఆదిమూలం సూర్యనారాయణగౌడ్ బాగేపల్లి, కోలార్, చింతామణి, బళ్ళారి జిల్లాలలో తెలుగు లోనే హరికథలు చెప్పడంతో కల్చరల్ అసోసియేషన్ వారు గుర్తించి ఆయనకు శివ నంది అవార్డు ఇచ్చి సత్కరించినట్లు నిర్వాహకులు తెలిపారు.

స్వయం ఉపాధికి ఉచిత శిక్షణ

పుట్టపర్తి రూరల్: ఎపిఎంఐపి ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్పు ఇరిగేషన్ ఫిట్టర్లుగా ఉపాధి పొందడానికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎపిఎంఐపి పీడీ సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023 -24 ఆర్థిక సంవత్సరం శ్రీ సత్యసాయి జిల్లాకు ప్రభుత్వం డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం 10,000 హెక్టార్ల టార్గెట్ నిర్దేశించిందని వాటిని ఫిట్టింగ్ చేయడానికి ఫిట్టర్ల కొరత ఉందన్నారు. పరికరములు అమర్చుటకు పదవ తరగతి పాసైన నిరుద్యోగ యువకులు నుండి ఎపిఎంఐపి ద్వారా ఫిట్టర్లుగా జిల్లాకు ఎంపిక చేసిన 25 డ్రిప్పు కంపెనీలలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకుగాను దరఖాస్తు చేసుకున్న వారు చేసుకుని వారు 18 సంవత్సరాల వయసు నిండి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ప్రాజెక్టు డైరెక్టర్ పుట్టపర్తి శ్రీ సత్యసాయి జిల్లా అడ్రస్‌కు నేరుగా కాని, పోస్ట్ ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం 7995010095,6309928360 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

ధర్నాను విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్యసాయి జిల్లా ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఆర్డీవోకార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ శ్రీ సత్య సాయి జిల్లా శాఖ చైర్మన్ మైనుద్దీన్, జనరల్ సెక్రటరీ జివైపి రావు కోరారు. జిల్లాలోని జేఏసీ అమరావతి అనుబంధ సంఘాల నాయకులు,ఉద్యోగులు ఈ ధర్నాలో పాల్గొనాలని వారు కోరారు. ఒక్కరోజు సామూహిక నిరాహారదీక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉద్యోగులు భారీగా పాల్గొని ఏపీ జేఏసీ అమరావతి లో చేస్తున్న ఉద్యమానికి మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పుట్టపర్తి రూరల్ : వడదెబ్బ, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగాఉండాలని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం కొత్త నిడిమామిడి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ (కుటుంబ వైద్యుడి భావన) కార్యక్రమాన్ని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎమ్మెల్యే హెచ్‌పి సుస్మిత, ఆరోగ్య కార్యకర్తలు శివ, మంజుల వాణి, ఆశా కార్యకర్తలు పార్వతమ్మ, నిర్మల, హసీనా, 104 సిబ్బంది లక్ష్మీపతి, మోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

మడకశిర రూరల్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఎపిజెఎసి నాయకులు విమర్శించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపి జెఎసి జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందప్ప ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను సోమవారం చేపట్టారు. యుటిఎఫ్, ఎస్‌టియు నాయకులు బూతన్న ఆదినారాయణ తదితరులు రిలే దీక్షకుమద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహాలింగప్ప, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆర్డీటీసెట్

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సీతారామయ్య బాలికల జూనియర్ కళాశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆర్డీటీ సెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షా కేంద్రాన్ని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీలకుమారి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆర్డీటీ సెట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచిన పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీతారామయ్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సీతారామయ్య. ఎన్డీఎల్ సురేంద్రకృష్ణ, ఏటీఎల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు

బుక్కపట్నం : ప్రభుత్వ నియమ నిబంధనలోబడే రిజిస్ట్రేషన్ జరగాలని సత్యసాయి జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ డిఐజి మాధవి తెలిపారు. సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలో గత రెండు నెలల నుంచి జరిగిన క్రయవిక్రయాలపై విచారించి రిజిస్ట్రేషన్ జరిగిన స్థలాలను, భూములను, తదితర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి మార్కెట్ విలువలు పెరుగుతుండడంతో ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకే రిజిస్ట్రేషన్లు చేయాలని, క్రయవిక్రయదారులు కూడా ప్రభుత్వ నిబంధనలను అనుసరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత శాఖ అధికారులు సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్ శ్రీనివాస్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ

చిలమత్తూరు : మండల పరిధిలోని శ్రీ సాయియేసు విద్యానికేతన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ సోమవారంతో ముగిసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు శిక్షణ అనంతరం నిర్వహించిన పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ నిర్వాహకులు భాస్కర్ రెడ్డి, బాలాజీరెడ్డి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు అందజేయండి

లేపాక్షి : ఉపాధి కూలీలకు పనిముట్టు అందజేయాలని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఫిరంగిప్రవీణ్‌కుమార్, నాయకులు రాజప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఉపాధి కూలీలతో కలసి సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కూలీల సమస్యలను ఎపిఓ జ్యోతికి వివరించారు.ఉపాధి కూలీలకు అలావెన్సులు, పనిముట్లు, మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకిట్లు అందించాలని డిమాండ్ చేశారు. సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించాలన్నారు. స్పందించిన ఎపిఓ వెంటనే పనిముట్లు అందజేస్తామని తెలిపారు..కల్లూరు గ్రామంలో ఆరు వారాల నుండి కూలీలకు డబ్బులు చెల్లించక పోవడంతో కూలీలు ఎవరూ పనిలోకి వెళ్లలేదు సోమవారం ఒక్క కూలీకూడా పనికి రాకపోవటంతో అందుకు గల కారణాలపై ఎపిఓ ఆరా తీశారు. సకాలంలో కూలీ డబ్బులు, పే స్లిప్‌లు ఇవ్వకపోతే తాము పనికి వెళ్లమని ఈసందర్భంగా కూలీలు చెప్పారు.

వాలంటీర్లకు సన్మానం

లేపాక్షి : మండలంలోనికోడిపల్లి, కొత్తపల్లి,నాగేపల్లి,విభూదిపల్లి గ్రామ వాలంటీర్లకు పంచాయతీ సర్పంచి మంజునాథ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా వాలంటీర్లను సన్మానించి పురస్కార పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఆనంద్ కుమార్, సచివాలయ సిబ్బంది అరుణ, శ్రీనివాసులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

కలెక్టర్ అరుణ్‌బాబు

అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జగనన్నకు చెబుదాం, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని గ్రీవెన్స్ గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు 204 అర్జీలను స్వీకరించారు. అనంతరం డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రీవెన్స్ కు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని మానిటర్ చేస్తూ సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డిఇఒ మీనాక్షి, పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మమ్మ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి రామకృష్ణ, డ్వామా పీడీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం

కదిరి, మడకశిరలో బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సిద్ధారెడ్డి, తిప్పేస్వామి

ర్యాలీలో పాల్గొన్న ధర్మవరం ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి కదిరి అర్బన్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ సిద్ధారెడ్డి పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సోమవారం కదిరిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ వేమారెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, ఇందిరాగాంధీ సర్కిల్, జీవిమాను సర్కిల్, చౌక్, కోనేరు సర్కిల్, క్లాక్ టవర్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న వైయస్సార్ విగ్రహం వరకు సాగింది. అక్కడ వైఎస్‌రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఈ నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్రాభివృద్ధికి తీసుకున్న చర్యల గురించి వివరించారు. బైక్ ర్యాలీ అనంతరం ఎమ్మెల్యే పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక ఆర్డీవోకార్యాలయం ఎదురుగా ఉన్న జగనన్న కాలనీని సందర్శించారు. అక్కడ ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఓ వ్యక్తి పూర్తి చేసిన ఇంటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఇస్మాయిల్, నాయకులు ప్రణీత్ రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని మండల కన్వీనర్లు, సర్పంచులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి బైక్ ర్యాలీని సోమవారం ప్రారంభించారు, అనంతరం వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాలుగు ఏళ్ల పాలనలో 9శాతం హామీలను నెరవేర్చరాలన్నారు.

ధర్మవరం టౌన్ : వైసిపి హయాంలో పేదల సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. ధర్మవరం పట్టణంలో వేల సంఖ్యలో ఇళ్లను పేదలకు కేటాయించి జగనన్న కాలనీల పేరుతో ఊళ్లను నిర్మిస్తున్న సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులు భారీ ర్యాలీ చేపట్టారు. తొలుత స్థానిక శివానగర్ లోని బచ్చు నాగం పల్లి కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివానగర్ నుండి దిమ్మెల సెంటర్ మీదుగా తేరుబజార్, అంజుమన్ సర్కిల్, పీఆర్టీ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా వేలాది మంది లబ్దిదారులతో కలసి ర్యాలీగా వచ్చి కాలేజ్ సర్కిల్ వద్ద ముగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సొంతింటి కలను జగన్మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కురుబ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్‌పర్సన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్ పెనుజూరు నాగరాజు, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ తో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యను కమిషనర్‌కు వివరిస్తున్న దృశ్యం

రోడ్డు పేరు మార్చొద్దు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఆర్‌పిజిటి రోడ్డు పేరును మార్చొద్దని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 31న జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆర్‌పిజిటి, దండు రోడ్డును ఈద్గా రోడ్డుగా మార్చుతు అజెండాలో పొందు పరిచారు. ఈ విషయం తెలుసుకున్న కొన్ని సంఘాల వారు సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ కుమార్, తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రశాంతంగా ఉన్న పట్టణంలో ఈ తరహా చర్యల వల్ల అల్లర్లు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి పేర్లను యధావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రక్షణ వలయం ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

కోట ప్రాంతంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు రక్షణ వలయం ఏర్పాటు చేయాలని వార్డు కౌన్సిలర్ మల్లికార్జున విద్యుత్ శాఖ అధికారిని కోరారు. ఈ విషయంపై సోమవారం విద్యుత్ శాఖ ఎఇకి వినతిని ఇచ్చారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన అధికారులు దానికి ఎటువంటి రక్షణ ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని అన్నారు. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో అధికారిణికి వినతిని ఇస్తున్న కౌన్సిలర్, వార్డు ప్రజలు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

అమరాపురం : మండలంలోని శివరాం గ్రామానికి చెందిన యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పరమేష్ (25) కియా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. కుటుంబసమస్యల కారణంగా పరమేష్ పురుగుల మందు తాగి పొలంలో పడి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు 108 సాయంతో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అయితే పరమేష్ అప్పటికే మృతిచెందాడు.

వ్యకిపై కత్తితో దాడి

పరిగి : మండలంలోని ఊటకూరుకు చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్‌పై అదే గ్రామానికి చెందిన నరసింహమూర్తి కత్తితో దాడి చేశాడు. అందుకు సంబందించిన వివరాలు... గ్రామానికి చెందిన నరసింహమూర్తికి మల్లేష్‌కు మధ్య గతంలో గొడవలు ఉండేవి. ఈ గొడవలపై ఎప్పటికైనా ప్రతీకారం తీర్చుకోవాలన్న కక్షకట్టిన నరసింహమూర్తి మల్లేష్‌ను పలుమార్లు వెంబడించాడు. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి నరసింహమూర్తి మరో వ్యక్తి గొడవ పడుతుండగా మల్లేష్ తారసపడ్డాడు. ఇదే అవకాశంగా తీసుకున్న నరసింహమూర్తి మల్లేష్‌పై చాకుతో దాడికి పాల్పడ్డాడు శరీరంలో పలుచోట్ల గాయాలు కావడంతో స్థానికులు హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు మల్లేష్ బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

పేకాటజూదరులు అరెస్టు

పరిగి : మండలంలోని కోడిగేనపల్లి చెరువు పరిసరాలలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వివాహిత హత్య కేసులో నిందితునికి మూడేళ్లు జైలు

అనంతపురం :ఓ హత్య కేసులో నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాసులు సోమవారం నాడు తీర్పు వెలువరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న కుమ్మరి కుమార్ భార్య కుమ్మరి మల్లీశ్వరి(42)కు తిరుపతి ఎస్‌టివి నగర్, అంబేద్కర్ రోడ్డుకు చెందిన గజ్జల అశోక్ కుమార్‌తో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయంలో కుమ్మరి కుమార్, అశోక్‌కుమార్ రెండు కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. అప్పటి దాకా కదిరిలో ఉంటున్న గజ్జల అశోక్ కుమార్ ఘర్షణల అనంతరం తన కుటుంబాన్ని తిరుపతికి మార్చాడు. తిరుపతికి వెళ్లిన తరువాత కూడా మల్లీశ్వరి, అశోక్‌కుమార్ మధ్య ఫోన్ సంభషణలు ఉండేవి. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని మల్లీశ్వరి అశోక్‌కుమార్‌ను కోరింది. దీంతో మల్లీశ్వరి చంపేస్తే సమస్య తీరుతుందని అశోక్‌కుమార్ భావించాడు. అందులో భాగంగా 30-8-2017న వినాయక చవితి పండుగ నేపథ్యంలో కుమ్మరి మల్లీశ్వరి కలవడానికి తిరుపతి నుంచి Ap 03 tv5788 కారులో స్వయంగా డ్రైవింగ్ చేసుకుని అశోక్ కుమార్ వచ్చాడు. మార్గమధ్యంలో మదనపల్లిలో ఒక కొడవలి కొని కారులో పెట్టుకున్నాడు. అప్పటికే తనకోసం సత్యసాయి జిల్లా కొక్కటి క్రాస్ వద్ద వేచిఉన్న కుమ్మరి మల్లీశ్వరిని కారులో ఎక్కించుకుని తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని మండ్లపల్లి గ్రామం వద్దగల భారత్ పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న మామిడి తోపులోకి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరం పెళ్లి చేసుకుందామని మల్లీశ్వరి అశోక్‌కుమార్‌ను కోరింది. అప్పటికే వివాహం అయిన గజ్జల అశోక్ కుమార్ ఆమె మాటతో ఏకీభవించ లేదు. దీనికి తోడు ఆమెపై అప్పటికే కక్షతో ఉన్న అశోక్‌కమార్ తన కారులో తెచ్చుకున్న కొడవలితో మల్లీశ్వరిని నరికి హత్య చేశాడు. అనంతరం కొక్కంటి గ్రామ విఆర్ఓ వెంకట రమణ సమక్షంలో కారుతో సహాలొంగిపోయాడు. ఈ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. కేసులో పలువురు సాక్షులను విచారించిన అనంతరం అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాసులు నిందితుడు అశోక్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితునికి శిక్ష పడేలా వ్యవహరించిన విచారణ అధికారులు సిఐలు శ్రీధర్, మన్సురుద్దీన్ కోర్టు కానిస్టేబుల్ మధు, పిపి హరినాథ్ రెడ్డిని ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు.

ప్రమాదంలో ఆటో దగ్ధం

లేపాక్షి : స్థానిక నవోదయ పాఠశాల వద్ద లేపాక్షి నుండి హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిలో గుర్తు తెలియని గూడ్స్ ఆటో అగ్నికి అహుతి అయింది. స్థానిక ప్రజలు గమనించి మంటలను అర్పడానికి ప్రయత్నం చేశారు కానీ మంటలు అదుపులోకి రాలేదు. గూడ్స్ ఆటోకు మంటలు చెలరేగిన వెంటనే డ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడని స్థానికులు తెలిపారు. కానీ ప్రమాదానికి గల కారణాలు మాత్రం తెలియ రాలేదు.

ఆటోకు అంటుకున్న మంటలు ఆర్పుతున్న దృశ్యం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెనుకొండ, మడకశిరలో విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శంకరనారాయణ, డాక్టర్ తిప్పేస్వామి

పెనుకొండ : రైతు సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ నారాయణ చేతుల మీదుగా విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలోనే రాయితీ విత్తన వేరుశనగను పంపిణీ చేస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డాక్టర్. వైయస్సార్ రైతు భరోసా మ్యాగజైన్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ, ఎంపీడీవో శివశంకరప్ప, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండల రాయుడు, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ నాగలూరు బాబు, వైస్ ఎంపీపీ నారాయణప్ప, మండల వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్‌తో పాటు రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గాండ్లపెంటలో వేరుశనగ పంపిణీ

కొత్తచెరువు : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా అగ్రి అడ్వైజర్ బోర్డ్ చైర్మన్ అవుటాల రమణారెడ్డి తెలిపారు మండల పరిధిలోనికొత్తచెరువు మీర్జాపురం ఆర్‌బికెలో విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తన కాయలు ఆర్‌బికెల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి శంకర్, మండల అగ్రి అడ్వైజర్ చైర్మన్ ప్రమీల శ్యాంసుందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి నటరాజు, ఎఇఒ ఉపేందర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : విత్తన వేరుశనగ పంపిణీని ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి, జెడ్పీటీసీ కోటి సుధ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీరాములు, వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రైతులు రాంభూపాల్ రెడ్డి, జయరాం రెడ్డి,వెంకటరంగారెడ్డి,రాజవీరారెడ్డి, మండల విస్తరణాధికారి వీరాంజనేయులు, ఆర్‌బికె ఇన్‌ఛార్జి హరిప్రియ, హసీనా,తదితర రైతులు పాల్గొన్నారు.

గాండ్లపెంట. మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద విత్తన వేరుశనగ పంపిణీని ఎంపీపీ జగన్మోహన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో లక్ష్మీ ప్రియ, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎస్ ఫయాజ్ అలీ, సర్పంచి రహమతుల్లా, ఆర్‌బికె చైర్మన్ వైవి శంకర నాయుడు, సికిందర్, మహేశ్వరి, సింధు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: రామగిరి రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి మీనుగ నాగరాజు, కరెన్న, నాగార్జున, నరసింహారెడ్డి, రామాంజనేయులు, ఏవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సర్పంచి చేతుల మీదుగా సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ కవిత, కార్యదర్శి వసుందరమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్ భాస్కర్ నాయక్, షాజాద్ బాషా, మండల నాయకులు డి. శేఖర్ రెడ్డి, బాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల : సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఎఓ రాజ్యలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని చెప్పారు.

రొద్దం : స్థానిక రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ చంద్రశేఖర్, తహశీల్దార్ అనంతచారి ,ఎంపీడీవో రాబర్ట్ విల్సన్, సర్పంచి రూప సోమవారం ప్రారంభించారు. విత్తనం అవసరమైన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద సంప్రదించి వేరుశనగ తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి నివేదిత కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి రెడ్డి ,వైస్ ఎంపీపీ హరిత, అంజనరెడ్డి, సింగల్ విండో ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, ఎఇఒ అంజాద్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ధర్మవరంలో విత్తన వేరుశనగ పంపిణీ

గోరంట్ల: రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ ఏడి అల్తాఫ్‌అలీఖాన్ తెలిపారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం విత్తన వేరుశనగ పంపిణీని ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ జయరాం నాయక్, అగ్రి అడ్వైజర్ చైర్మన్ రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ విత్తన వేరుశనగను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రంగనాయకులు, ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, ఆర్‌బికె సిబ్బంది గౌతమ్ నాయక్, వైష్ణవి, అశ్విని, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం మండలంలోని కొనుటూరు రైతు భరోసా కేంద్రంలో రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించినట్లు వ్యవసాయ అధికారి చన్న వీరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూనుతురు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం -పుట్టపర్తి ఉప వ్యవసాయ సంచాలకులు స్రవంతి, విద్యావతి, ధర్మవరం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య పర్యవేక్షణలో ఈ వేరుశనగ పంపిణీ జరిగిందని తెలిపారు. వేరుశనగ పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మడకశిర రూరల్ : మండలంలోని ఆర్ అనంతపురం రైతు భరోసా కేంద్రం వద్ద సబ్సిడీ వేరుశనగను ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుసంక్షేమమే వైసిపి ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో వీర నరేష్, ఎంపీపీ కవిత సత్యనారాయణ, జెడ్పీటీసీ సరోజమ్మ నరసింహమూర్తి, నాయకులు జయరాజు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.